క్లుప్తంగా

సత్యదేవుని సన్నిధికి పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న సత్యప్రభ, గోపిరాజు

ప్రత్తిపాడు రూరల్: ఎన్డీఏ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా విజయాన్ని పురస్కరించుకుని 16 మంది రాచపల్లి నుంచి అన్నవరానికి పాదయాత్ర చేపట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని రాచపల్లికి చెందిన మాజీ సర్పంచ్ బుద్ధరాజు గోపిరాజు ఆధ్వర్యంలో గురువారం ఈ పాదయాత్రను చేపట్టారు. ఎమ్మెల్యే సత్యప్రభ, గోపిరాజు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, నాగు చంటిబాబు, దుర్గాచక్రవర్తి, గోపి, శ్రీను, రమణ, సురేష్, గణపతి, వీరబాబు, అశోక్, బాబ్జీ, ప్రకాష్, బాబి, రాజా, నాగు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా కూరగాయల పంటలు



చేపూరులో సాగవుతున్న బెండ, ఆనప పాదులు

తుని రూరల్: నైరుతి రుతు పవనాల ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కూరగాయల పంటలకు పుష్కలంగా సాగునీరు లభించింది. ఆరుతడిగా సాగయ్యే కూరగాయల పంటలను వేసవిలో రైతులు సాగు చేశారు. ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు, నీటితడులు అందక కొంతమేరకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. మళ్లీ వర్షాలతో నీటితడి లభించడంతో పంటలు కోలుకుంటున్నాయి. మండలంలో చేపూరు, రాజుపేట, వి.కొత్తూరు, తాళ్లూరు, కుమ్మరిలోవ, డి.పోలవరం, కొలిమేరు, రేఖవానిపాలెం, మరువాడ గ్రామాల్లో రైతులు బీర, బెండ, వంగ, దొండ, చిక్కుళ్లు, కాకర తదితర కూరగాయలను 150 ఎకరాల్లో పండిస్తున్నారు.

హనుమంతునికి వరుపుల ప్రత్యేక పూజలు



హనుమంతునికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామంలో గురువారం హనుమంతునికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వరుపుల పాల్గొన్నారు. హనుమంతుని జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వరుపులతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వయోవృద్ధ నిలయంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీను

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు జాతీయ రహదారి చెంతనే ఉన్న శ్రీశారదా వయోవృద్ధ నిలయంలోని వృద్ధులకు పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద వృద్ధులకు ఆహార పొట్లాలను అందజేశారు. తన మనవరాలు లషిక జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు ధరణాలకోట శ్రీను తెలిపారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి వైశాఖ అమావాస్య సందర్భంగా గురువారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం అమ్మవారికి నీరాజన, మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. హోమం, పూజా కార్యక్రమాలను వేద పండితులు యనమండ్ర శర్మ ఘనపాఠి, అర్చకులు దత్తాత్రేయశర్మ, కోట వంశీ, పరిచారకులు ఫణిశర్మ, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

టీకాలతో చెక్

- తొలకరిలో పశువులపై ప్రాణాంతక వ్యాధుల దాడి
- పాడి పశువులకు జబ్బవాపు, గొంతువాపు వ్యాధులు
- రోగ నివారణకు వ్యాక్సిన్లు తప్పనిసరి



తొండంగి మండలం గోపాలపట్నంలో ఆవుకు టీకా వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ వీరబాబు

తొండంగి: తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో పాడి పశువుల్లో ప్రాణాంతక గొంతు(గురక) వాపు, జబ్బవాపు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించాలని బెండపూడి పశు వైద్యాధికారి బి.చైతన్య తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులు, పాల వ్యాపారంపై ఆధారపడి ఎన్నో లక్షల కుటుంబాలు జీనం సాగిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 2.68 లక్షల గేదె 76 వేల ఆవులు ఉండగా, తొండంగి మండలంలో పశువులు 26,711, మేకలు, గొర్రెలు 33,024 వరకూ ఉన్నాయి. గ్రామాల్లో పాడి పశువులున్న ప్రతి ఇంటికీ వెళ్లి పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణకు వ్యాక్సిన్లు వేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. విడతల వారీగా అన్ని పాడి పశువులకు వెటర్నరీ అసిస్టెంట్లు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశు వైద్యాధికారి బి.చైతన్య వివరించారు.

జబ్బవాపు వ్యాధి వ్యాప్తి

జబ్బవాపు(బ్లాక్వాటర్) వ్యాధి పశువు సప్ప, కండరాల్లో వ్యాధి కలిగించే బ్యాక్టీరియా (క్లాస్ట్రీడియంచోవియే) రక్తంలోకి చేరి, తొడ, భుజం, ఛాతి కండరాలు కుళ్లిపోయేలా చేస్తుంది. సమస్య ఉన్నచోట నొక్కడం ద్వారా కరకర శబ్దం (క్రిపిటేటింగ్ సౌండ్స్) వస్తే జబ్బవాపును గుర్తించవచ్చు.

లక్షణాలు

పశువులకు అందించే కలుషిత నీరు, ఆహారం, దెబ్బతిన్న గాయాల ద్వారా ఆరోగ్యంగా దృఢంగా ఉన్న ఆరు నెలల నుంచి రెండేళ్ల వయస్సు లేగ దూడల్లో ఇది వస్తుంది. గేదెలలో కన్నా ఆవుల్లోనే ఎక్కువగా వ్యాపిస్తుంది. జూన్ మొదటి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో గుండె వేగం ఎక్కువగా ఉండటం, ఆకలి మందగించడం, 108 డిగ్రీల జ్వరం, ఆహారం తినకపోవడం, నెమరు వేయకపోవడం వంటి లక్షణాలుంటాయి.

సత్వర చికిత్స అందించకుంటే ప్రాణాపాయమే..

పశువుల్లో ఆయా లక్షణాలను గుర్తించి 12 నుంచి 24 గంటల్లోపు వైద్యం అందించాలి. కండరాల్లో కుళ్లిన ప్రాంతాన్ని తొలగించి యాంటీ బయోటిక్స్ అందించి చికిత్స చేయాలి. లేకుంటే వెంటనే చనిపోయే అవకాశం ఉంది.

గొంతువాపు (గురక) సోకడానికి కారణాలు

తొలకరి వర్షాలు పడినప్పుడు పాశ్చురెల్లా హిమోలైటికా అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. దీనినే గొంతు వాపు వ్యాధి, గురక జబ్బు, కంఠ మాద, ఎర్రదొమ్మ, కుత్తుక వాపు, గురక తెగులు అని వివిధ ప్రాంతాల్లో పిలుస్తారు. ఒక పశువు నుంచి మరొక దానికి వ్యాపిస్తుంది. వాతావరణ మార్పుతో పాటు, అపరిశుభ్ర నీరు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం వంటి కారణాలతో ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా రెండు నుంచి నాలుగేళ్ల పెయ్యల్లో వ్యాధి వస్తుంది. వీటితో పాటు ఆవులు, మేకలు, గొర్రెలు, గాడిదలు పాశ్చురెల్లా హిమోలైటికా అనే సూక్ష్మజీవి వలన ఈ వ్యాధి కలుగుతుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా..

తాగునీరు, కలుషిత వాతావరణం, అనారోగ్య పశువుల స్పర్శ, మేత, పరికరాలు, ఈగలు, జోరీగల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా వరదల కారణంగా నిలిచిపోయిన మురుగు నీటిలో, అపరిశుభ్ర పశువుల పాకలు, వాటి పరిసరాలు ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారకాలు. ఈ వ్యాధి ముఖ్యంగా శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. పశువుల గొంతు, మెడ కింది భాగంలో వాపు కనిపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

మేత, నెమరు మందగించడం, పాలు నిలిచిపోవడం, గొంతు కింది భాగంలో జలవాపు ప్రారంభమై క్రమంగా మెడ కింది భాగానికి, ఆ తర్వాత కాళ్ల మధ్య ఎదురు రొమ్ము కిందికి చేరుతుంది. పశువు తీవ్రమైన ఆయాసంతో రొప్పుతూ, గురకపెడ్తూ ముక్కు నుంచి, నోటి నుంచి నురగ వంటి స్రావాలను కారుస్తుంది. చెవి ప్రాంతంలో విపరీతమైన వేడి ఉంటుంది. కళ్లు ఎర్రగా మారుతాయి. కొన్ని సందర్భాల్లో చాక్లెట్ రంగులో కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ

ఈ వ్యాధికి గురైనట్టు తెలుసుకునేందుకు పశువుల రక్తపు నమూనాలు సేకరించి పరీక్షలు జరపడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. సకాలంలో సరైన చికిత్స అందించడంతో పాటు, టీకాలు వేయడం వంటి నివారణ చర్యలు తీసుకోవాలి. శరీరం లోపలి అవయవాల్లో కనిపించే మార్పుల వల్ల కూడా వ్యాధి నిర్ధారణ చేస్తే మరీ మంచిది.

అందించాల్సిన చికిత్స

ఈ వ్యాధికి గురైన పశువులకు బాగా విశ్రాంతినివ్వాలి. రోజుకు నాలుగైదు సాంబ్రాణి ధూపం వేసి పీల్చుకునేలా చేస్తే ఉపశమనం ఉంటుంది. చికిత్స అందించేందుకు పేడను దాచిపెట్టాలి. బంధించాల్సి వస్తే శ్వాసకు ఇబ్బంది లేకుండా సున్నితంగా బంధించాలి. ఎన్రోఫ్లాక్సిసిన్ సిప్రోఫ్లాక్ససిన్ జెంటామైసిన్, సల్ఫా పెన్సిలిన్ వంటి ఏదైనా యాంటీ బయోటిక్ ఇంజెక్షన్లను వరుసగా కనీసం 3,4 రోజులు ఇవ్వాలి.

నివారణ చర్యలు

ఈ వ్యాధికి గురైన పశువును గుర్తించగానే మిగతా పశువులకు దూరంగా ఉంచాలి. పశువుల పాకల్లోకి క్రిమికీటకాలు చేరకుండా శుభ్రంగా ఉంచాలి. పాడిసున్నం, గెమాక్సిన్, డీడీటీ, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్ వంటి కీటక నాశకాలను స్ప్రే చేయాలి. చనిపోయిన పశువుల కళేబరాలను, వాటి వ్యర్థాలను కొట్టాలకు దూరంగా, భూమి లోతుగా తవ్వి పాతి పెట్టాలి. వీటిని పచ్చిక బీడ్లు, పంట భూములు, చెరువులు, వాగులు, కాల్వల్లోకి వదకుండా చూసుకోవాలి. వానాకాలం రాగానే పశువుల్లో గురక వ్యాధి లేదా గొంతు వాపు వ్యాధి రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి. సకాలంలో చికిత్స అందించడం ద్వారా ఇతర పశువులకు ఈ వ్యాధి సోకకుండా చూడవచ్చు.

కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలి



పాడి పశువుల్లో గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్లు పశువులున్న ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్లు వేస్తున్నారు. ప్రతి పశువుకు కచ్చితంగా ఈ ప్రాణాంతక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలి. ఇప్పటి వరకూ గొంతు వాపు వ్యాధి నివారణ 870, జబ్బవాపు వ్యాధి నివారణకు 3,238 పశువులకు వ్యాక్సిన్లు వేశాం. అదేవిధంగా 8,848 గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణకు టీకాలు ఇచ్చాం.

– బి.చైతన్య, పశు వైద్యాధికారి బెండపూడి, తొండంగి మండలం

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ



ఉండవల్లిలో చంద్రబాబునాయుడిని కలిసిన వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడిని, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఉండవల్లిలోని వారి స్వగృహంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే జ్యోతులకు అభినందనలు



తన కార్యాలయంలో ఎమ్మెల్యే నెహ్రూకు అభినందనలు చెబుతున్న రామ్‌కుమార్ తదితరులు

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ప్రముఖులు, అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు. గురువారం తన కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పలువురు టీడీపీ నేతలు, ప్రముఖులు.. నెహ్రూను కలిసి అభినందనలు చెప్పారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



ఏలేశ్వరంలోని గ్రంథాలయంలో ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవి కొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు పలువురు ఉపాధ్యాయులు కథలు, కథనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనంపై శిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధుల చేతుల మీదుగా సుమారు 50 మంది విద్యార్థులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఈ శిబిరాలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు చెన్నాప్రగడ సత్యగాంధీ, లయన్స్ ప్రతినిధులు ఎ.నాగేశ్వరరావు, జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

తుని: నెల రోజుల పాటు స్థానిక శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు, ముగింపు వేడుకల్లో పాల్గొన్న చిన్నారులకు ముఖ్య అతిథి నాగభూషణం మాష్టారు బహుమతులు అందజేశారు.



తుని లైబ్రరీలో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు



కిర్లంపూడి గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

కొనసాగుతున్న శిబిరాలు

కిర్లంపూడి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి శాఖా గ్రంథాలయాల్లో గురువారం బాల బాలికలకు ఆటల పోటీలు, కథలు, పెయింటింగ్, బుక్ రీడింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు ఏ కళలపై మక్కువ ఉందో గుర్తించి, తర్ఫీదు ఇస్తున్నారు. ఈ నెల 7న ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని కిర్లంపూడి గ్రంథాలయ అధికారి డి.మరిడిబాబు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



తుని సరస్వతి శిశు మందిరంలో మొక్కలు నాటుతున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని స్థానిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డీఎస్ మూర్తి పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక శ్రీసరస్వతి శిశు మందిర్‌లో క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ చెట్లు తొలగించేస్తుండడం వల్ల ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు మొక్కలను విరివిగా నాటి, వాటిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, పర్వత బాబూరావు, కండవల్లి జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

శంఖవరం: కత్తిపూడి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వ్యవస్థలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జగ్గంపేట డీఈ కె.రత్నాలరావు తెలిపారు. కత్తిపూడి, సీతంపేట, వజ్రకూటం, కొత్తూరు తదితర గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ అంతరాయం ఏర్పడుతుందన్నారు.


ఘనంగా నేరేళ్లమ్మ తల్లి జాతర



అన్నవరంలో ప్రత్యేకాలంకరణలో నేరేళ్లమ్మ తల్లి



గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు



ఆలయంలో ఏర్పాటు చేసిన దీపారాధన

అన్నవరం: గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లికి తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు వైశాఖ అమావాస్య గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి నేరేళ్లమ్మ వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. నేరేళ్లమ్మ వారిని రాత్రి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

సత్యదేవుని ఆవిర్భావానికి ముందే..

గ్రామంలో సత్యదేవుని ఆవిర్భావానికి ముందు నుంచీ నేరేళ్లమ్మ తల్లి వెలిసినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. అన్నవరం దేవస్థానం చరిత్ర లో కూడా నేరేళ్లమ్మ తల్లి ప్రస్తావన ఉంది. గతంలో ఈ ఆలయ నిర్వహణను పురగిరి క్షత్రియలతో కూడిన కమిటీ నిర్వహించేది. రత్నగిరి దేవస్థానం ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకుని, నూతన ఆలయం నిర్మించి, గత 30 ఏళ్లుగా ఈ జాతర నిర్వహిస్తోంది. ఈ తొమ్మిది రోజులూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, గరగల సంబరం నిర్వహించారు. సత్యదేవునికి ఆడపడుచుగా నేరేళ్లమ్మ తల్లిని పుట్టింటి మర్యాద చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా అమ్మవారికి రత్నగిరి దేవస్థానం నుంచి సారె, చీర సమర్పించారు.

గోపాలపట్నంలో..

తొండంగి: అమావాస్య సందర్భంగా గోపాలపట్నం గ్రామదేవత నేరేళ్లమ్మ జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నేరేళ్లమ్మ అమ్మవారికి తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలంతా పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారికి వివిధ రకాల పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు ఉత్సవం, జాతర మహోత్సవం నిర్వహించారు. దేవతామూర్తుల వేషధారణతో ప్రదర్శనలు, గరగ నృత్యాలు, కోలాటం వంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శనలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

వేసవి దుక్కులతో పంటకు మేలు



జగ్గంపేటలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

జగ్గంపేట: రుతు పవనాలు వచ్చే సమయం ఆసన్నమైనందున రైతులు వేసవి దుక్కులు వేగవంతం చేయాలని జగ్గంపేట మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. వేసవి దుక్కుల వల్ల పంటలకు మేలు జరుగుతుందన్నారు. భూమికి తేమను నిలుపుకొనే శక్తి పెరుగుతుందని, గట్టి పొరలు విడిపోయి భూమి గుల్లగా మారుతుందని వివరించారు. సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెంది, సేంద్రియ పదార్థాలు పెరుగుతాయని, కలుపు మొక్కలు నశించి, భూమి సారవంతమవుతుందని చెప్పారు. దీనివల్ల ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. పంటలకు ఆశించే పురుగులు వేసవిలో నిద్రావస్థలో ఉంటాయని, వేసవి దుక్కుల కారణంగా అవి బయట పడతాయని తెలిపారు. వీటిని పక్షులు ఆహారంగా స్వీకరించడం, మరికొన్ని ఎండవేడికి మరణించడం వల్ల పంటలకు నష్టం తప్పుతుందని తెలిపారు. గత పంటకు సంబంధించిన మొక్కల వేర్లు భూమి పొరల్లో ఎరువుగా మారతాయన్నారు. ఎలుకల బెడద తగ్గుతుందని చెప్పారు. దుక్కులు పూర్తయ్యాక వర్షాలు ప్రారంభం కాగానే పంట వేసుకోవచ్చని వ్యవసాయాధికారి శ్రీరామ్ తెలిపారు.

సాగునీటి చెరువులో జల కళ



రాజుపేట సీతయ్య చెరువులో స్వల్పంగా చేరిన వర్షపు నీరు

తుని రూరల్: తొలకరిలో వారం రోజులుగా కురుస్తున్న మోస్తరు వానలకు సాగునీటి చెరువుల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో చెరువుల్లో స్వల్పంగా నీటి నిల్వలు చేరాయి. గత నెల 30 నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తుని మండలంలో 116.7 మిల్లీమీటర్లు, కోటనందూరు మండలంలో 117.3 మిల్లీమీటర్లు, తొండంగి మండలంలో 180.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే పది రెట్లు ఎక్కువగా ఉంది. ఇదే విధంగా వర్షాలు కురిస్తే ఖరీఫ్‌కు అవసరమైన సాగునీరు అందుబాటులో ఉంటుందని మెట్ట ప్రాంత రైతులు పేర్కొన్నారు. వారం రోజుల కిందట వరకు కనీసం పశువులు తాగేందుకు చెరువుల్లో నీరు లేదని, ఇప్పుడిప్పుడే వర్షపు నీరు చేరుతుందన్నారు.

తలుపులమ్మ తల్లికి రూ.35.23 లక్షల ఆదాయం



లోవలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.35,22,980 ఆదాయం లభించిందని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి, గ్రేడ్-2 ఈఓ జె.సత్యనారాయణ, దేవదాయ శాఖ పెద్దాపురం తనిఖీదారు వి.సురేష్ పర్యవేక్షణలో దేవస్థానంలోని హుండీలను గురువారం తెరచి ఆదాయం లెక్కించారు. భక్తులు హుండీల ద్వారా 42 రోజులకు సమర్పించిన మొత్తాన్ని లెక్కించామని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. నాణేల రూపంలో రూ.1,26,745, నోట్లు రూ.33,96,235 వచ్చాయన్నారు. ఆదాయం లెక్కింపులో బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

టోల్ గేట్లు తొలగించాలని ఆందోళన



రౌతులపూడిలో టోల్‌గేట్ శిబిరం వద్ద ఆందోళన చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ఓ ప్రైవేట్ కంపెనీ పేరుతో నిర్వహిస్తున్న మైనింగ్ టోల్‌గేట్లను తొలగించాలంటూ రౌతులపూడి గ్రామానికి చెందిన పలువురు ట్రాక్టర్ యజమానులు గురువారం ఆందోళన చేశారు. గత కొంతకాలంగా స్థానికంగా మట్టి, నల్లరాయి మెటల్, ఇసుక, నల్లరాయి నుంచే వచ్చే క్రషర్ బూడిద తదితర వాటిని రవాణా చేసే ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై భారీ స్థాయిలో చార్జీలు వసూలు చేస్తున్నారంటూ వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మండలంలోని రౌతులపూడి, బలరామపురం, బంగారయ్యపేట, కుదుంపాత్రుని సమీపంలో నిర్వహిస్తున్న టోల్ గేట్లను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే బలరామపురం వద్ద ప్రైవేట్ సంస్థ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న చిన్నతాటాయాకుల శిబిరాన్ని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని సంస్థ బాధ్యులకు తెలియజేస్తామని సిబ్బంది తెలిపారు.